# రూ.443 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ పమేలా సత్పతి

కార్పొరేషన్, మార్చి 27: కరీంనగర్ నగర పాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.443 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. గురువారం సాయంత్రం కరీంనగర్ నగరపాలక సంస్థలో స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షతన, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన రూ.443.98 కోట్లు అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. సొంత ఆదాయ వనరులు, ప్రభుత్వ గ్రాంట్లకు సంబంధించిన పన్నులు, పన్నేతర ఆదాయ వనరులు, ప్రణాళిక నిధులు, ప్రణాళికేతర నిధులు, ఇతర నిధులకు సంబంధించిన పద్దులపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి 1/3 నిధులను విలీన గ్రామాల ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల మైనారిటీలు నివసించే ప్రాంతాలు, మురికివాడల మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. మిగిలిన నిధులను వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులకు కేటాయించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధుల నుంచి పార్కులు, వైకుంఠ ధామాలు అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, శాస్త్రీయ పద్ధతిలో డంపు యార్డుల నిర్మాణం, కరెంట్ బిల్లుల చెల్లింపులు మొదలగు వాటికి అయ్యే ఖర్చులను నగరపాలక సంస్థ ఆదాయం నుంచి వినియోగించాలని బడ్జెట్‌లో సూచించారు. బడ్జెట్‌లో అంచనాలు సవరించిన అంచనాల పద్దుల ప్రకారం సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, నగరపాలక సంస్థకు సొంత ఆదాయ వనరులు ఇంకా మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ టార్గెట్ ప్రకారం ఆస్తి పన్నులు పూర్తి స్థాయిలో వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై పూర్తిస్థాయిలో ఫోకస్ చేయడంతోపాటు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. నగరంలో పెండింగ్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నగర తాగునీటి సరఫరా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్, అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు స్వరూపారాణి, ఖాదర్ మొహియుద్దీన్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ యాదగిరి, సంజీవ్, ఏసీపీలు బషీరొద్దీన్, వేణు, అకౌంట్స్ అధికారి శిరీష, ఆర్వో భూమానందం, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచులపై నిర్బంధకాండ

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు

**చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలో గురువారం మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బిల్లులు చెల్లించమని అడిగితే పొద్దు పొడవకముందే పోలీసులు ఇండ్లలోకి వచ్చి అరెస్టులు చేయడం విడ్డూరమని మాజీ సర్పంచులు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే నిర్బంధించడమేంటని ప్రశ్నించారు.**



గన్నేరువరం : పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచులు



గంగాధర : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

గంగాధర, మార్చి 27 : రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోందని, గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీమల్ల మేఘరాజు అన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మాజీ సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, ఎండీ నజీర్, పొట్టల కనుకయ్య, కొంకటి శంకర్ తదితరులు ఉన్నారు.



చిగురు మామిడి : పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

గన్నేరువరం, మార్చి27: తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ వెళ్లకుండా మండలంలోని బీఆర్ఎస్ మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు తీగల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ సర్పంచులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు గంప మల్లీశ్వరివెంకన్న, పుల్లెల లక్ష్మి లక్ష్మణ్, శారద శ్రీనివాస్ ఉన్నారు.

చిగురుమామిడి, మార్చి 27 : చిగురుమామిడి మండల మాజీ సర్పంచులను పోలీసులు తెల్లవారుజామున పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోగా, అసెంబ్లీ సమావేశాల వేళ సర్పంచులను అరెస్టు చేయడం అక్రమమని సర్పంచ్ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు జక్కుల రవి ఆరోపించారు. అసెంబ్లీ చివరి రోజున ముట్టడి చేస్తామని ప్రభుత్వం మాజీ సర్పంచులను అరెస్టు చేసి కట్టడి చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పోలీసుల అదుపులో చిగురుమామిడి, ముది మాణిక్యం, ఒగులాపూర్, గాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచులు బెజ్జంకి లక్ష్మణ్, జక్కుల రవి, బోయిని శ్రీనివాస్, సన్నీల్ల వెంకటేశంతో పాటు సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మిరెడ్డి తదితరులున్నారు.

## ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలి

కలెక్టరేట్, మార్చి 27 : వారధి సంస్థలో కొనసాగుతున్న ఉద్యోగులందరి ప్రావిడెంట్‌ఫండ్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ క్రమం తప్పకుండా సకాలంలో చెల్లించాలని, సొసైటీ చైర్‌పర్సన్, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వారధి సొసైటీ పదో వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వారధి సొసైటీలో ఇప్పటివరకు 85,129 మంది ఉపాధి, ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. సొసైటీ ఆరు జిల్లాల పరిధిలో సేవలందిస్తోందని, 2,997 మంది ఈ సంస్థ ద్వారా ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు సంస్థ వార్షికాదాయ వ్యయాలు సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, వారధి సొసైటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఐకేపీ కొనుగోలు కేంద్రాలు 150కి పెంపు

కలెక్టరేట్, మార్చి 27 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం ఇందిరా క్రాంతి పథం కింద మహిళా సంఘాలతో నిర్వహిస్తున్న కేంద్రాలు 150కి పెంచుతున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ లక్ష్యాలు, వాటి సాకారం కోసం తీసుకుంటున్న చర్యలపై పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 49 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా, ప్రస్తుత యాసంగిలో 150 వరకు పెంచనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీధర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇస్తేనే సర్వే ప్రారంభిస్తాం

విద్యానగర్, మార్చి 27: పెండింగ్ లెప్రసీ బిల్లులు పూర్తిగా ఇస్తేనే సర్వే ప్రారంభిస్తామని తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత అన్నారు. ఈమేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ, 2022, 23, 24 సంవత్సరాల సం బంధించిన బిల్లులు ఇవ్వకుండా ఆశ కార్యకర్తలను చాలా ఇబ్బందుల గురి చేస్తున్నారన్నారు. లెప్రసీ సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తకు ప్రతి సంవత్సరం 1050 చొప్పున 3150 ఇవ్వాలన్నారు. ఇక్కడ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నగెల్లిపద్మ, జిల్లా సహాయ కార్యదర్శి సరిత ఉన్నారు.

## ఉపాధ్యాయులకు గౌరవ భృతి ఇప్పించాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబర్ 2024లో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఇతర ఉద్యోగులకు ఇవ్వాల్సిన గౌరవ భృతి, హాజరు సర్టిఫికెట్ ఇప్పించాలని కరీంనగర్ జిల్లా ఉపాధ్యాయ సంఘాలు, పంచాయతీ సెక్రెటరీల సంఘం తరపున గురువారం కలెక్టర్‌కు విన్నవించారు. తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌ను కలిశారు. ఇక్కడ పీఆర్టీయూ, ఎస్టీయూ, డీటీఎఫ్, యుటీఎఫ్, టీఆర్టీఎఫ్, టీపీఆర్టీయూ, టీటీయూ, పంచాయతీ సెక్రటరీ సంఘం ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, ఎం జైపాల్ రెడ్డి, కె రవీంద్రాచారి, టీ తిరుపతి, కేఎఫ్ జావేద్, ఖాజా మంజూర్ అలీ, జీ శ్రీనివాస్, జీ చంద్రశేఖర్, ఈశ్వరయ్య తెలంగాణ పంచాయతీ సెక్రటరీ జిల్లా ఫోరమ్ అధ్యక్షుడు జీ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఇరుకుల్ల ఇటుక బట్టీల నిర్వహణపై విచారణ

కరీంనగర్ రూరల్, మార్చి 27: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వద్ద గురువారం ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా ఐదేళ్ల నుంచి అక్రమంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారని స్థానిక నాయకుడు రాకేశ్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి మోకా పైకి వెళ్లి ఇటుక బట్టీలు పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు రాకేశ్‌తోపాటు ఇటుక బట్టీల యజమానితో విచారణ చేశారు. బట్టీల అనుమతి పత్రాలను చూపించాలని ఎంపీవో అడిగితే ప్రస్తుతం లేవని చెప్పడంతో వారం రోజుల్లో సమర్పించాలని యజమానికి సూచించారు.

## 'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

కలెక్టరేట్, మార్చి 27:ఈనెల 21న జిల్లాలో కురిసిన అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, తెలంగాణ రైతుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎం నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చొప్పదండి, కరీంనగర్ రూరల్, మానకొండూరు, చిగురుమామిడి మండలాలతోపాటు పలుచోట్ల మార్కెట్ యార్డుల్లో విక్రయానికి వచ్చిన ధాన్యం, మక్క నీటి పాలైందన్నారు. అధికారులు అంచనాలు రూపొందించి పరిహారం అందజేసి, ఆదుకోవాలని పేర్కొన్నారు.

## మద్యం షాపులో రెండు బీర్ల చోరీ

శంకరపట్నం, మార్చి 27: మండలంలోని మొలంగూర్ వైన్స్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద గల దుర్గా వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి దుండగులు రేకుల షెడ్డు పైకప్పు తొలగించి లోనికి దూరారు. విద్యుత్ సర్వీస్ వైర్‌ను కట్ చేశారు. సీసీ కెమెరాలతోపాటు డీవీఆర్ బాక్స్‌ను సైతం ధ్వంసం చేశారు. ఉదయం గమనించిన నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేవలం రెండు బీరు సీసాలు దొంగిలించినట్లు వైన్‌షాపు నిర్వాహకులు వెల్లడించడం గమనార్హం. కేశవపట్నం ఎస్ఐ రవి, క్లూస్ సీఐ స్వర్ణ జ్యోతి, సిబ్బంది ఆధారాల కోసం వెతికారు.

## ఘనంగా ప్రపంచ నాటక దినోత్సవ సంబురాలు

చిగురుమామిడి, మార్చి 27: ప్రపంచ రంగస్థలనాటక దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద తెలంగాణ రంగస్థలం సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ మండలాధ్యక్షుడు శ్రీ రామోజు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నాటక దినోత్సవ సంబురాలు గురువారం నిర్వహించారు. సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ జిల్లా సహాయ కార్యదర్శి చందబోయిన పరశురాములు, మండల ప్రధాన కార్యదర్శి రాధారపు సంపత్, కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి కొమురయ్య, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులున్నారు.

## వేసవిలో తాగునీటి కొరత రావద్దు

శంకరపట్నం, మార్చి 27: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీపీవో జగదీశ్వర్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో క్రిష్ణప్రసాద్, హుజూరాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, మిషన్ భగీరథ డీఈఈ ఖాజావాసుద్దీన్, ఏఈ విలాస్, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నవోదయలో మాక్ పార్లమెంట్

చొప్పదండి, మార్చి 27: జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం మాక్ పార్లమెంట్ బాల్ సంసాద్ కార్యక్రమాన్ని 9వ తరగతి విద్యార్థులతో నిర్వహించారు. విద్యార్థులు స్పీకర్ పార్లమెంట్ సభ్యుల పాత్ర పోషించి చర్చించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, టీఎంకే రాయుడు, ఉపాధ్యాయులున్నారు.

## చెర్లభూత్కూర్‌లో పచ్చకామర్ల కలకలం

కరీంనగర్ రూరల్, మార్చి 27: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో అత్యధిక మంది ప్రజలు పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతుండడం కలకలం రేపింది. వారం రోజులుగా సరఫరా చేస్తున్న నీటివల్ల పచ్చకామెర్లు వస్తుండవచ్చనే అనుమానం గ్రామస్తుల్లో భయం చోటు చేసుకుంది. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్, గ్రామ పంచాయతీ రక్షిత మంచి నీటి సరఫరా నీటిని పరీక్షించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. గ్రామంలో దాదాపు 70 మందికి పైగా పచ్చకామర్ల వ్యాధితో బాధపడుతున్నారని, గ్రామ పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, ప్రత్యేకాధికారి ఎంపీడీవో ఆకుల సంజీవరావు నీటి పరీక్షలు చేసి, గ్రామంలో పచ్చకామర్ల వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తైబజార్ వేలం @ రూ.40లక్షల 61వేలు

జమ్మికుంట, మార్చి27 : జమ్మికుంట బల్దియా తైబజార్ వేలాన్ని కార్యాలయం సమావేశ మందిరంలో కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాటకు 23 మంది కాంట్రాక్టర్లు హాజరయ్యారు. వేలం పాటను పరకాలకు చెందిన పొరండ్ల రమేశ్ రూ.40లక్షల 61వేలకు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని తైబజార్‌కు ఇటీవల టెండర్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. గతంలో రెండుసార్లు కోరం లేక వాయిదా వేశామని చెప్పారు. గురువారం వేలం పాటకు 23మంది కాంట్రాక్టర్లు హాజరయ్యారన్నారు. మున్సిపల్ పరిధిలో తైబజార్ ఫీజులు నిబంధనల ప్రకారం వసూలు చేసుకుంటారని చెప్పారు. ఇక్కడ మేనేజర్ రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, ఎస్ఐ సదానందం పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

గంగాధర, మార్చి 27 : కరీంనగర్ సూర్య నర్సింగ్‌హోమ్ సౌజన్యంతో నాయకుడు తూడి లచ్చయ్య ఆధ్వర్యంలో మండలంలోని మల్లాపూర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఇక్కడ హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★ **కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును,** కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.

NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189


## బయోమైనింగ్‌ను నిరంతరం కొనసాగించాలి

కార్పొరేషన్, మార్చి 27 : నగరంలోని చేపడుతున్న బయోమైనింగ్ ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని, ఇందుకోసం తగిన చర్యలు చేపట్టాలని ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను నగర కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ ఆదేశించారు. గురువారం డంపు యార్డును సందర్శించి బయోమైనింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డులోని రిసోర్స్ పార్కులో గల కంపోస్ట్ పిట్లలో కూరగాయలు వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ సెంటర్ పనులు పూర్తి చేసి సెగ్రిగేషన్ సరిగా జరిగేలా చూడాలన్నారు. ఇక్కడ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ స్వామి తదితరులున్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సాయిరాం

రామడుగు, మార్చి27 : రామడుగు మండల కేంద్రానికి చెందిన నీలం సాయిరాం జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో కరీంనగర్ జట్టు ప్రథమస్థానం పొందగా, ఢిల్లీ డిఫెన్స్ ఇంటర్ విద్యార్థి, రామడుగు మండల కేంద్రానికి చెందిన నీలం సాయిరాం ప్రతిభ కనబరచాడు. దీంతో అతడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 30 వరకు బీహార్‌లో జరిగే పోటీల్లో సాయిరాం పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు సాయిరాంకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'హాస్టల్ విద్యార్థులకు పౌష్ఠికాహారం అందించాలి'

కలెక్టరేట్, మార్చి 27 : సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్ఠికాహారం అందించాలని, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. రాంనగర్‌లో గల ప్రభుత్వ గిరిజన పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. వంట గదిలో శుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోస్ట్ మెట్రిక్ విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకుని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇక్కడ డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీటీడీవో జనార్దన్, తదితరులున్నారు.

## 'ఉపాధి' కల్పనలో తిమ్మాపూర్ వెనుకంజ

తిమ్మాపూర్,మార్చి27: ఉపాధి హామీ పనులు కల్పించడంలో తిమ్మాపూర్ మండలం వెనుకంజలో ఉందని డీఆర్డీవో శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై రికార్డులను పరిశీలించారు. గ్రామ,గ్రామానికి సంబంధిన పనులు, టార్గెట్, రికార్డులు పరిశీలించారు. రూ.83వేల రికవరీకి ఆదేశించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. మండలంలో 2,500 మంది కూలీలు రోజూ వచ్చేలా చూడాలన్నారు. ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ లు పాత నోటీసుల పేమెంట్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ, ఏపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా/కలెక్టరేట్, మార్చి 27 : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం కుటుంబాలకు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జ యపాల్ రెడ్డి సహకారంతో రేషన్ కిట్లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డలో గల మసీద్ వద్ద సుమారుగా 200 మంది ముస్లింలకు జయపాలన్న మిత్రమండలి సభ్యులు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా మైత్రి చా నల్ ఎండీ సుజన్ రావు మాట్లాడుతూ, మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి రూ.20 లక్షలతో 2 వేలకు పైగా పేద ముస్లిం కుటుంబాలకు రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జయపాలన్న మిత్రమండలి సభ్యులు ఎండీ అఖిల్ అహ్మద్‌ఖాన్, ఖాలీద్ అక్బర్, అమ్జద్ లాలా, ఖాలీద్, మతిన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న సూరేపల్లి సుజాత తదితరులు

కమాన్‌చౌరస్తా, మార్చి 27 : 'సరైన అవగాహనే.. సైబర్ నేరాలకు నివారణ' ప్రత్యేక పోస్టర్‌ను రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు శాతవాహన యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. ఇక్కడ రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఉత్తమ యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, ప్రముఖ రచయిత గాయకులు గసికంటి కుమార్, బొర్ర అశ్విని, తడగొండ ప్రవీణ్, జేరిపోతుల మహేశ్, దుర్గం ఈశ్వర్, తదితరులున్నారు.

## బాధ్యతల స్వీకరణ

కమాన్‌చౌరస్తా, మార్చి 27 : కరీంనగర్ సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయ చైర్మన్‌గా చిట్టుమల్ల కొండయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో కుటుంబ సభ్యులు, ధర్మకర్తలు అయిందాల లక్ష్మయ్య, నలువాల ప్రకాశ్ పటేల్, మిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఈవో ఎండపల్లి మారుతి, ఆర్యవైశ్య సేవ సంఘం అధ్యక్షుడు చిదుర సురేశ్, జాతీయ వర్తక, వాణిజ్య సంఘం ప్రతినిధి గౌరిశెట్టి మునీందర్, సాయి భజన మండలి బాధ్యులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానకు ఉత్తమ అవార్డు

రామడుగు, మార్చి27 : రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లిపల్లె దవాఖాన జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికైందని రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ, నేషనల్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌క్వాస్ బృందం ప్రభుత్వ దవాఖానల్లో మార్చి 1న తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 8 పల్లె దవాఖానలకు ఎన్‌క్వాస్ నాణ్యత సర్టిఫికెట్లతోపాటు ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేశరాజ్‌పల్లి పల్లె దవాఖాన 88.12 శాతం మార్కులతో ఉత్తమ అవార్డును దక్కించుకున్నట్టు వైద్యాధికారి తెలిపారు.

## ట్రాక్టర్ క్రింద పడి డ్రైవర్ మృతి

సైదాపూర్, మార్చి27 : మండలంలోని సోమారం గ్రామ శివారులో ట్రాక్టర్‌క్రింద పడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన పోలుదాసరి సమ్మయ్య(56) ట్రాక్టర్ లోడ్‌తో శంకరపట్నం వెళ్తూ సోమారం శివారులో ట్రాక్టర్ ఆపి దిగాడు. ఈ సమయంలో ట్రాక్టర్ కదులుతూ ఉండడంతో ఆపుదామని ట్రాక్టర్ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## యాప్‌లో బిల్లుల చెల్లింపు సులువు

ముకరంపుర, మార్చి 27: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులకు ఆన్ లైన్ విధానంలో సేవలు అందించేందుకు అందుబాటులోకి తెచ్చిన టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ మేక రమేశ్ బాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో 1,27,339మంది వినియోగదారులు రూ.1327.84లక్షల బిల్లులు చెల్లించారని తెలిపారు. ఎన్పీడీసీఎల్ యాప్‌తో పాటు థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా కూడా బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్, మార్చి 27 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన మక్క కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. వెన్కేపల్లి-సైదాపూర్ ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఘనపూర్, ఎల్లంపల్లి గ్రామాల్లో మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన మక్కలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టుకు నీరందించాలి



అచ్చంపల్లిలో కెనాల్ నీటిని పరిశీలిస్తున్న రామారావు

వీణవంక, మార్చి 27: ఎండల తీవ్రత దృష్ట్యా పంటలు ఎండిపోకుండా రానున్న మూడు వారాల వరకు రైతులకు కెనాల్ నీళ్లందించాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు పొలాడి రామారావు అన్నారు. మండలంలోని అచ్చంపల్లిలో స్థానిక రైతులతో కలిసి ఎస్సారెస్పీ కెనాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటి పారుదల అధికారులు కెనాల్ వెంబడి నిరంతర పర్యవేక్షణ చేయాలని, లేనియెడల పొలాలకు నీళ్లందక పొట్టదశలో ఎండిపోతాయని తెలిపారు. మరో మూడు వారాల పాటు రైతాంగానికి నీరందించి చివరి ఆయకట్టు రైతుల పంటలను కాపాడాలని కోరారు.

## ఉద్యోగుల సమస్యల సాధనకు సహకరించాలి



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న టీజీఈ జేఏసీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ నాయకులు

కొత్తపల్లి, మార్చి 27 : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల సాధనకు సహకరించాలని జిల్లా టీజీఈ జేఏసీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ కలెక్టర్‌ను కోరారు. గురువారం రాష్ట్ర టీజీఈ జేఏసీ ఆదేశానుసారం నూతనంగా ఏర్పాటైన కరీంనగర్ జిల్లా టీజీఈజేఏసీ స్టీరింగ్ కమిటీ జేఏసీ నాయకులు కలెక్టర్ పమేల సత్పతిని గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను సమస్యలను కలెక్టర్‌కు వివరించి పరిష్కరించాలని కోరారు. ఇక్కడ నాయకులు నాగుల నరసింహస్వామి, కరుణాకర్‌రెడ్డి, కట్టా రవీంద్రాచారి, తూముల తిరుపతి, పెద్ది విజయ్, ముల్కల కుమార్, శశిధర్ శర్మ, కిరణ్ కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మేందర్‌ంగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్, దేవేందర్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ కళాశాలను యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలి



వీసీకి వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

కమాన్‌చౌరస్తా, మార్చి 27 : శాతవాహన యూనివర్శిటీకి నూతనంగా మంజూరైన ఇంజినీరింగ్ కళాశాల, లా కాలేజీల్లో ఇంజినీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలిస్తూ అధికారులు చర్యలు తీసుకోవడం సరికాదని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఈమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో వీసీ ఉమేశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్, విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ, శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల, లా కళాశాల రావడం విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందనన్నారు. కరీంనగర్ విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రపూరిత చర్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రణాళిక రూపొందించారని పేర్కొన్నారు. ఇక్కడ ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు జల్లపల్లి అంజన్న, గంట కిరణ్మయి, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, యూనివర్సిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సాగర్, నగర కార్యదర్శి నందు, ఆకాశ్ తదితరులున్నారు.

## బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

కార్పొరేషన్/కలెక్టరేట్, మార్చి 27: బాలల రక్షణ చట్టాలపై చిన్నారులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న అన్నారు. కరీంనగర్‌లోని సవరణ్ స్ట్రీట్ 43 డివిజన్‌లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న హాజరై మాట్లాడుతూ, బాలల రక్షణ గురించి అనాథ పిల్లలు, బాల కార్మికులు, దివ్యాంగులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమణి, అంగన్‌వాడీ టీచర్ అశ్విని, ఇందిరా, 43 డివిజన్‌లో మదర్సా స్కూల్ హెచ్ఎం అబ్దుల్, అంగన్వాడీ కార్యకర్త అపర్ణ తదితరులున్నారు.

ఇల్లందకుంట మార్చి 27 : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ రాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండల బాలల పరిరక్షణ కమిటీ శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వరావు, వైద్యుడు తులసీదాస్, ఏపీఎం రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, సోషల్ వర్కర్ రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంకరపట్నం, మార్చి 27: బాల్యాన్ని స్వేచ్ఛగా ఎదగనివ్వాలని సీడీపీవో శ్రీమతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్యాన్ని భద్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇక్కడ తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో క్రిష్ణప్రసాద్, ఎంఈవో లక్ష్మీనారాయణ, వైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఏఎస్ఐ సుధాకర్, తదితరులున్నారు.